క్లుప్తంగా

సూక్ష్మ సేద్య పరికరాలపై అవగాహన



పీసపాడు(క్రోసూరు): పీసపాడు గ్రామంలోని రైతుభరోసా కేంద్రంలో ఉద్యానశాఖ ఆధ్వర్యంలో ఏపీఎంఐపీ ద్వారా అందించే సూక్ష్మ సేద్య డ్రిప్, స్పింకర్ల ఉపయోగాలు, రాయితీల గురించి మిర్చి రైతులకు అవగాహన కల్పించారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి సీహెచ్ జనని మాట్లాడుతూ డ్రిప్స్‌పై సన్నకారు రైతులకు 90 శాతం, పెద్ద రైతులకు 50 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు వెల్లడించారు. స్పింకర్లపై సన్నకారు రైతులకు 55 శాతం, పెద్ద రైతులకు 45శాతం సబ్సిడీ ఇస్తున్నట్లు వివరించారు. వైస్ ఎంపీపీ విప్పల వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఏఓ ఆర్.మోషా నాయక్, గ్రామ వ్యవసాయాధికారి పవన్, రైతులు పాల్గొన్నారు.

పథకాలు వినియోగించుకోవాలి



అమరావతి: ప్రభుత్వ పథకాలను వినియోగించుకుని మహిళలు ఎదగాలని ఎంపీపీ మేకల హనుమంతరావు చెప్పారు. మంగళవారం స్థానిక జనచైతన్య సమితి నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత టైలరింగ్ శిక్షణ పొందుతున్న మహిళలు టైలరింగ్ డే వేడుకలు నిర్వహించారు. జనచైతన్య సమితి కో–ఆర్డినేటర్ వెలితోటి అనిల్‌కుమార్ అధ్యక్షత వహించారు. ఎంపీపీ హనుమంతరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల మహిళలు టైలరింగ్‌తో ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ఈ సందర్భంగా 500 మంది మహిళలకు శిక్షణ ఇచ్చిన నడకుదురు వెంకటరావమ్మను సత్కరించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ప్రసాదబాబు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు కళాకారులకు సావిత్రి పురస్కారాలు



సత్తెనపల్లి: విజయవాడలో కొత్తాపూర్ణానంద కళామందిరం మా సంస్థ ద్వారా ఈ నెల 27న సావిత్రి పురస్కారాలను పలువురు ప్రతిభావంతులైన కళాకారులకు ప్రదానం చేసింది. సత్తెనపల్లికి చెందిన డాక్టర్ సరికొండ రమాదేవి, తెలగతోటి కోటేశ్వరరావు, పొత్తూరి రామకోటయ్య పురస్కారాలు అందుకున్నారు. మంగళవారం పలువురు పట్టణ ప్రముఖులు వారిని అభినందించారు.

నలుగురిపై వరకట్నం కేసు

నాదెండ్ల: అదనపు కట్నం తేవాలంటూ వేధిస్తున్న భర్తతో పాటూ మరో ముగ్గురిపై నాదెండ్ల పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై ఆవుల భాస్కర్ తెలిపిన వివరాల మేరకు తూబాడు గ్రామానికి చెందిన షేక్ మైమున్‌కు ఏడాది క్రితం పిడుగురాళ్లకు చెందిన షేక్ అబూబకర్‌తో వివాహమైంది. వివాహమైన కొద్దినెలల నుంచి అదనపు కట్నం తేవాలంటూ భర్త వేధింపులకు గురి చేస్తున్నాడంటూ మంగళవారం మైమున్ ఫిర్యాదు చేసింది. దీంతో భర్త అబూబకర్‌తో పాటూ మరో ముగ్గురు కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్

నరసరావుపేట టౌన్: చోరీ కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.10 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు టూటౌన్ సీఐ వీరేంద్ర బాబు మంగళవారం తెలిపారు. ఇస్లాంపేటకు చెందిన అబ్దుల్ రహిమాన్ ఇంట్లో గత ఏడాది నవంబర్ 2వ తేదీన చోరీ జరిగింది. ఈ మేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సంఘటనలో లభ్యమైన వేలిముద్రలు ఆధారంగా నిందితులు పాతనేరస్తులైన రాజుపాలెం మండలం కొండమోడుకు చెందిన షేక్ బాబావలి, అనంతపురం జిల్లా టిలిగి గ్రామానికి చెందిన కోరంకి రవితేజలుగా గుర్తించారు. అప్పటి నుంచి నిందితుల కోసం గాలిస్తుండగా మంగళవారం పట్టుబడ్డారు. నిందితులపై గుంటూరు, ప్రకాశం, పల్నాడు జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్‌లలో 20కి పైగా చోరీ కేసులు ఉన్నట్లు సీఐ తెలిపారు. ఈ మేరకు నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచామన్నారు.

దాతల సహకారం అభినందనీయం

శావల్యాపురం: మండలంలోని గుంటుపాలెం గ్రామపంచాయతీ శివారు గ్రామం భాస్కర్ నగర్‌లో అంగన్‌వాడీ సెంటరుకు దాతలు సహకారం అభినందనీయమని సెక్టారు సూపర్‌వైజరు గుర్రం శేషకుమారి అన్నారు. మంగళవారం వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భీమని అంకారావు అంగన్ సెంటరు సెంటరును సందర్శించి స్టాండ్ ఫ్యాన్ వితరణ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త వెంపరాల శ్రీలక్ష్మి గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఉన్నారు.

మీ భూమి .. మా హామీ..!

భూముల వివరాలకు.. సవరణలకు.. ఆస్తుల క్రమబద్ధీకరణకు పట్టణ ప్రాంతాల్లోని మున్సిపల్ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన అవసరం ఇక ఉండదు. 'మీ భూమి – మా హామీ' కార్యక్రమంలో భాగంగా రెవెన్యూ, పురపాలక శాఖ అధికారులే ఇంటికి వచ్చి రీ–సర్వే చేసి, ఆస్తులకు శాశ్వత పత్రాలు మంజూరు చేస్తారు. ఈ నూతన ఒరవడికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.

- పట్టణ ప్రాంతాల్లో భూముల సమగ్ర రీ–సర్వే
- వందేళ్ల తర్వాత ఆస్తుల మదింపు
- సత్తెనపల్లి పట్టణంలో 5,411.23 ఎకరాల్లో రీ–సర్వే



పట్టణంలో రీ–సర్వేలో భాగంగా.. కొలతలు తీస్తున్న సిబ్బంది

సత్తెనపల్లి: పట్టణ ప్రాంతాల్లో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం ముందడుగు వేసింది. వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు భూ రక్ష పథకం ద్వారా వందేళ్ల తర్వాత పట్టణ ప్రాంతాల్లో మీ భూమి – మా హామీ అన్న పేరుతో రీ– సర్వే పూర్తి చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మున్సిపాలిటీ పరిధిలోని నివాసాలను రీ–సర్వే చేసి, ఖచ్చితమైన వివరాలు అందించనుంది. అత్యంత వ్యయంతో కూడిన ఈ మహా యజ్ఞం దేశంలోనే మొట్టమొదటిసారిగా మన రాష్ట్రంలోనే జరుగుతోంది. రెవెన్యూ, సర్వే భూ రికార్డుల శాఖ, పురపాలక పట్టణాభివృద్ధి శాఖ సంయుక్త భాగస్వామ్యంతో సమగ్ర రీ–సర్వే నిర్వహిస్తున్నారు. ఈ సర్వేను ఏడు ప్రక్రియలుగా నిర్వహించి, ప్రతి ఆస్తికి ప్రభుత్వ హామీతో కూడిన శాశ్వత హక్కు పత్రం ఇవ్వనున్నారు. సత్తెనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని వడ్డవల్లిలో 2,294.34 ఎకరాలు, సత్తెనపల్లిలో 3,116.89 ఎకరాలు వెరశి 31 వార్డుల్లో 5,411.23 ఎకరాల్లో రీ–సర్వే నిర్వహించనున్నారు.

సర్వే ఇలా....

- వార్డు సభల ద్వారా సర్వే విధివిధానం, షెడ్యూలు ప్రయోజనాల వివరణ.
- వార్డు సచివాలయ పరిధిలో సమగ్ర సర్వే నిర్వహణకు సర్వే బృందాల ఏర్పాటు.
- డ్రోన్, కార్స్ నెట్‌వర్క్, రోవర్ వంటి ఆధునిక పరికరాలద్వారా ప్రతి స్థిరాస్తిని అత్యంత ఖచ్చితంగా భూ అక్షాంశ, రేఖాంశాలతో గుర్తించి కొత్త సర్వే, రెవెన్యూ రికార్డులను తయారు చేయడం.
- ప్రతి యజమానికి పైరికార్డులను సెక్షన్ 9 (2) నోటీసు ద్వారా తెలియజేయడం.
- ఏవైనా అభ్యంతరాలుంటే వార్డు సర్వే బృందాల ద్వారా అప్పీలుకు అవకాశం కల్పించడం.
- మున్సిపల్‌స్థాయిలో నియమించిన మొబైల్ మేజిస్ట్రేట్ బృందాలద్వారా అపీళ్లను పరిష్కరించడం.
- సర్వే పూర్తి చేసిన అనంతరం ప్రతి ఆస్తికి శాశ్వత భూ హక్కు పత్రం అందించడం.
- భవిష్యత్తులో ఆస్తులకు సంబంధిత తగాదాలు ఏర్పడినా పరిష్కారానికి వీలుగా సర్వే, రెవెన్యూ రికార్డులు, ఆస్తుల వివరాలు డిజిటల్ రూపంలో వార్డు సచివాలయంలో అందుబాటులో ఉంచడం.

రీ–సర్వేపై అనుమానాలు, అపోహలొద్దు



వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు భూ రక్ష రీ–సర్వేపై ఎటువంటి అనుమానాలు, అపోహలొద్దు. రీ–సర్వేతో లాభం తప్ప నష్టం ఏమాత్రం ఉండదు. సర్వే చేసే సమయంలో యజమానులు వారికి సంబంధించిన భూ హక్కు పత్రాలతో హాజరై సర్వే సిబ్బందికి సహకారం అందించాలి. వ్యవసాయ భూములకు ఖచ్చితమైన రికార్డులు అందించినట్లే పట్టణ పరిధిలోని ఆస్తులకు ఖచ్చితమైన రికార్డులు సిబ్బందికి అందించి, ప్రజలు సహకారం అందిస్తే సర్వే వేగవంతంగా పూర్తి అవుతుంది.

– కొలిమి షమ్మి, కమిషనర్, సత్తెనపల్లి మున్సిపాలిటీ

ఆస్తులకు కొత్తగా డిజిటల్ రూపంలో సిద్ధమయ్యే రికార్డులు..

- భూకమత పటం
- పట్టణ సర్వే పటం
- రీ–సర్వే ల్యాండ్ రిజిష్టర్
- 1బీ రిజిష్టర్
- వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు పత్రం

సర్వేతో నివాసితులకు కలిగే లాభాలు...

ఆస్తులకు ఖచ్చితమైన కొలతలు చూపించడంతో పాటు ప్రభుత్వ హామీతో కూడిన శాశ్వత భూమి హక్కు పత్రం అందించడం జరుగుతుంది. ల్యాండ్ మ్యాప్ అందజేస్తారు. ఆస్తికి గుర్తింపు నంబరు అందజేస్తారు. అభ్యంతరాలు ఉంటే పరిష్క రించడానికి మున్సిపల్ స్థాయిలో మొబైల్ మేజిస్ట్రేట్ టీం అందుబాటులో ఉంటుంది. దళారీ వ్యవస్థకు చెక్ పెట్టడం జరుగుతుంది. భూ యజమానులు కార్యాలయాలు చుట్టూ, అధికారుల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదు. వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కును వేరొకరు సవాల్ చేయడానికి వీలుండదు. క్రమబద్ధీకరణ చేయని నివాసాలకు క్రమబద్ధీకరణ చేయడం జరుగుతుంది.

విజ్ఞాన శాస్త్రంతో ఉజ్వల భవిష్యత్తు

నకరికల్లు:జాతీయ సైన్స్ దినోత్సవాన్ని స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. విద్యార్థులు రూపొందించిన పలు ప్రాజెక్టులను ప్రదర్శించారు. సైన్స్ క్విజ్ నిర్వహించి బహుమతులు అందజేశారు. సీవీ రామన్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ప్రధానోపాధ్యాయురాలు కె.రంగాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిశోధనల్లో ప్రతిభ చూపాలి

సత్తెనపల్లి: విద్యార్థులు చదువుతోపాటు పరిశోధనల్లోనూ ప్రతిభ చూపాలని ప్రగతి విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ మక్కెన అచ్చయ్య పేర్కొన్నారు. పట్టణంలోని ప్రగతి పాఠశాలలో మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. సీవీ రామన్ జయంతిని పురస్కరించుకొని సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన వివిధ ప్రాజెక్టులను చైర్మన్ పరిశీలించారు. సర్ సీవీ రామన్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఎగ్జిబిషన్‌ను కరస్పాండెంట్ మక్కెన పద్మజ ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ షేక్ మస్తాన్ వలి, ఉపాధ్యాయులు నాగేంద్ర బాబు, రూబీ హెప్సిబా, నాగలక్ష్మి, శ్రీకాంత్, షఫీ, సలీం, తదితరులున్నారు.

ప్రతిభా ప్రదర్శన

క్రోసూరు/అచ్చంపేట: క్రోసూరు స్పిమ్స్ పాఠశాలలో మంగళవారం జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు పర్యావరణ పరిరక్షణ, మానవ శరీరభాగాలు, ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే నష్టాలు, వ్యవసాయం, రోబో, వైర్‌లెస్ బల్బు, సౌరకుటుంబంలోని గ్రహాలు, వాటి విశిష్టత, పీరియాడిక్ టేబుల్, జలచక్రం, కెమికల్స్ వల్ల ఉపయోగాలు, నష్టాలు, మేక కిడ్నీ పనితీరు గురించి నమూనాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో పాఠశాల డైరక్టర్ ఎం.గోవర్ధరావు, ఎం.పద్మావతి, సైన్సు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

- సైన్స్‌డే సందర్భంగా అచ్చంపేట బ్లూబెల్స్ స్కూల్‌లో మంగళవారం విద్యార్థులు నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనలు తల్లిదండ్రులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయిని శ్రీలత మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులు 196 నమూనాలను ప్రదర్శనలో ఉంచినట్లు వివరించారు.ఉత్తమ ప్రదర్శనలకు బహుమతులు పంపిణీ చేశారు.

ఆకట్టుకున్న నమూనాలు

అమరావతి: కేరళ మోడల్ స్కూల్ విద్యార్థులు సైన్సు నమూనాలతో ఆకట్టుకున్నారు. మంగళవారం స్థానిక స్కూల్‌లో నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో సత్తాచాటారు. పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్‌లు శ్రీజిత్, రామకృష్ణ పర్యవేక్షణలో నీటిడ్యామ్, సోలర్ సిస్టమ్, ఆర్గానిక్ వ్యవసాయం, మ్యూజియం, దేవాలయం, పొగతాగటం హానికరం, సెల్‌పోన్ రేడియేషన్ వంటి వంద అంశాలపై నమూనాలు ప్రదర్శించారు.

ఫణిదంలో..

సత్తెనపల్లి: మండలంలోని ఫణిదం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. సర్ సీవీ రామన్ విశిష్టతను ప్రధానోపాధ్యాయుడు పి.శ్రీనివాసరావు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సైన్స్ ఎగ్జిబిట్స్ ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థులు సైన్స్ ఆకారంలో ప్రదర్శన నిర్వహించారు.



నమూనాతో నకరికల్లు విద్యార్థి



సీవీ రామన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



స్పిమ్స్ పాఠశాల సైన్స్ ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు



సైన్సు నమూనాలతో విద్యార్థులు



ఫణిదంలో సైన్స్ డే ఆకారంలో విద్యార్థులు

'చేదోడు'తో టైలర్స్‌కు మేలు

సత్తెనపల్లి: జగనన్న చేదోడు పథకం ద్వారా టైలర్స్‌కు పూర్వవైభవం లభించి తమ జీవితాల్లో వెలుగులు నిండాయని ప్రగతి టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ జానీ అన్నారు. ప్రపంచ టైలర్ల దినోత్సవం సందర్భంగా ప్రగతి టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని తన దుకాణం ఎదుట ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. అనంతరం జెండా ఆవిష్కరించి వ్యవసాయ మార్కెట్ యార్డు వరకు ర్యాలీ నిర్వహించారు. మార్కెట్ యార్డులో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. జగనన్న చేదోడు పథకం అమలు చేసిన ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ముందుగా విలియమ్స్ హూవ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు, టైలర్స్ అసోసియేషన్ సెక్రటరీ షేక్ రఫీ, వైస్ ప్రెసిడెంట్ వై.ప్రసాద్, ట్రెజరర్ శిరసాల అంకారావు, ముఖ్య సలహాదారుడు షేక్ సైదా, పూల రాజు, మహిళా టైలర్లు పాల్గొన్నారు.



పట్టణంలో ర్యాలీ చేస్తున్న ప్రగతి అసోసియేషన్ టైలర్స్

ముప్పాళ్లలో టైలర్స్ డే..

ముప్పాళ్ల: మండల కేంద్రమైన ముప్పాళ్లలో టైలర్స్ డే వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. కుట్టుమిషన్ సృష్టికర్త విలియమ్స్ చిత్రపటానికి నివాళులర్పించారు. యూనియన్ జెండాను ఎగురవేశారు. ఇటీవల మృతి చెందిన టైలర్స్ అసోసియేషన్ మాజీ మండలాధ్యక్షుడు సలీం చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో టైలర్స్ చిన్నసైదా, మౌలాలి, మన్నంచిన్నకోటేశ్వరరావు, స్మార్ట్‌మస్తాన్‌వలి, అప్పయ్య, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధిలో ఆర్యవైశ్యుల సేవలు వెలకట్టలేనివి

ఏఎంసీ చైర్మన్ పెండెం బాబురావు

సత్తెనపల్లి: పట్టణాభివృద్ధిలో ఆర్యవైశ్యుల కృషి, సహకారం వెలకట్టలేనిదని సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబురావు అన్నారు. ఆర్యవైశ్య సేవా సమితి అధ్యక్షుడు వెలుగురి శరత్‌బాబు అధ్యక్షతన పట్టణంలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థాన కల్యాణ మండపంలో వివిధ పదవులు పొందిన ఐదుగురు ఆర్యవైశ్య ప్రముఖులను మంగళవారం సత్కరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బాబురావు వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం పల్నాడు జిల్లా అధ్యక్షుడు అచ్యుత్ శివప్రసాద్, ఏఎంసీ డైరెక్టర్లు బచ్చు వరలక్ష్మి, దేవరశెట్టి రవికుమార్, పల్నాడు జిల్లా మానవ హక్కుల సంఘం అధ్యక్షుడు శివాపురం వెంకటరామారావు, సత్తెనపల్లి ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యుడు కొత్తా రామకృష్ణను సత్కరించారు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అనేక విషయాల్లో ఆర్యవైశ్య సామాజిక వర్గానికి పెద్దపీట వేశారని వారు తెలిపారు. మంత్రికి హృదయ పూర్వక అభినందనలు తెలిపారు. సంఘ ప్రధాన కార్యదర్శి దివ్వెల శ్రీనివాసరావు, ఆర్యవైశ్య చలివేంద్ర సంఘం అధ్యక్షుడు సింగరి మధుసూదనరావు, పట్టణాధ్యక్షుడు ఆత్మకూరి వెంకట హరేరామ చెంచయ్య, కూకుట్ల శ్రీనివాసరావు, పెరుమాళ్ళ లక్ష్మినవ్నారాయణ, కొత్తూరి విశ్వేశ్వరరావు, మద్ది వెంకటేశ్వరరావు, పోతుగంటి నరసింహరావు, త్రిపుర మల్లు, వెంకటేశ్వర్లు, కనమర్లపూడి సుబ్బారావు, తోమంద్రు సత్యనారాయణ, జూపల్లి పాల్, చిలకల వాసు, దేవతి శివప్రసాద్, రెడ్డి శ్రీను, నగర సంకీర్తన బృందం సభ్యులు పాల్గొన్నారు.



సత్కారం అందుకున్న ఆర్యవైశ్య నాయకులు

దర్జీలు వృత్తి నైపుణ్యం పెంచుకోవాలి

అచ్చంపేట/పెదకూరపాడు/బెల్లంకొండ: దర్జీలు ప్రభుత్వం అందిస్తున్న సాయాన్ని ఉపయోగించుకుని అవకాశాలను అందిపుచ్చుకుని వృత్తి నైపుణ్యం పెంచుకోవాలని ఎస్ఐ కె.పాల్‌రవీంద్ర సూచించారు. టైలర్స్ డే సందర్భంగా అచ్చమ్మ పేరంటాలమ్మ టైలరింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఎస్‌బీఐ కాంప్లెక్స్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. తొలుత విలియం హోవే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య మాట్లాడుతూ టైలర్స్‌కు ప్రభుత్వం అండగా నిలుస్తోందని చెప్పారు. టైలర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు తిరువాయిపాటి ఆంజనేయులు మాట్లాడుతూ ప్రభుత్వం టైలర్ల సంక్షేమానికి కృషి చేయాలని కోరారు. అనంతరం సీనియర్ టైలర్ చల్లా ఆంజనేయులును సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ భూక్యా రజనీ కృష్ణానాయక్, గ్రామ సర్పంచ్ కంబాల వీరబాబు, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా కన్వీనర్ సాతర్ల శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు మెహిద్దీన్, అసోసియేషన్ సభ్యులు పుసులూరి ఏడుకొండలు, దామెర్ల వీరబ్రహ్మం, తైబు, హుస్సేన్, రమేష్, బాజి, నాగులుషరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

- పెదకూరపాడు నేతాజీ టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం టైలర్స్ డే నిర్వహించారు. విలియమ్‌హోవే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ మస్తాన్ వలి, వైస్‌ప్రెసిడెంట్ నాసరయ్య ఆధ్వర్యంలో సామాజిక ఆరోగ్య కేంద్రంలోని రోగులకు పండ్లు, పౌష్టికాహారం పంపిణీ చేశారు.కార్యక్రమంలో సూరేపల్లి నాసరయ్య, షేక్ వలి, ఆయూబ్, నందిగామ రమేష్, సైదులు, కె.నాగేశ్వరరావు, షేక్ సుభాని తదితరులు పాల్గొన్నారు.
- బెల్లంకొండ మండల కేంద్రంలో మంగళవారం 'టైలర్స్ డే వేడుకలు జరిగాయి. దర్జీలు ర్యాలీ నిర్వహించారు. ప్రధాన సెంటర్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. విలియం హోవే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సంఘ నాయకులు కోటేశ్వరరావు, వివిధ గ్రామాల టైలర్లు సైదాచారి, చిరంజీవి, సైదావలి తదితరులు పాల్గొన్నారు.



అచ్చంపేటలో విలియం హోవే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న టైలర్స్ అసోసియేషన్ సభ్యులు



పెదకూరపాడులో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న అసోసియేషన్ సభ్యులు



బెల్లంకొండలో విలియంహోవే చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న టైలర్లు

అధినేతకు ఆత్మీయ అమాత్య స్వాగతం



రైతు భరోసా, ఇన్‌పుట్ సబ్సిడీ నగదు రైతుల ఖాతాల్లో జమ చేసేందుకు తెనాలికి వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు సాదర స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛం అందజేసి, ఆత్మీయంగా పలకరించారు. – సత్తెనపల్లి

బలహీనవర్గాలకు అవకాశం హర్షణీయం

అచ్చంపేట: క్రోసూరు మార్కెట్‌యార్డు కమిటీలో బలహీన వర్గాలకు అవకాశం కల్పించడం హర్షణీయమని జెడ్పీటీసీ తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి చెప్పారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సామాజిక న్యాయం వైఎస్సార్ సీపీకే సాధ్యమని చెప్పారు. ఎన్నడూ లేని విధంగా అచ్చంపేట మండలం నుంచి నలుగురికి అవకాశం కల్పించడం సంతోషకరమన్నారు. ఉపాధ్యక్ష పదవితో పాటు ఎస్సీ, ఎస్టీలకు అవకాశం కల్పించడం శుభసూచకమన్నారు. అచ్చంపేట మండలం నుంచి మార్కెట్ కమిటీలో చోటు దక్కించుకున్న కొండూరు ఎస్టీ కులానికి చెందిన శ్రీరాములునాయక్‌ను, కొత్తపల్లి బీసీ వర్గానికి చెందిన మేకల శ్రీనివాసరావును, చిగురుపాడు కాపు సామాజిక వర్గానికి చెందిన ఆకుల కోటేశ్వరరావును, పెదపాలెం నుండి ఓసీ కోటాలో చోటు దక్కించుకున్న చిరుమామిళ్ల నరశింహారావును ఆయన అభినందించారు. చైర్మన్‌గా ఎంపికైన ఈదా సాంబిరెడ్డికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

తొండపిలో 'ఫ్యామిలీ డాక్టర్'

తొండపి(ముప్పాళ్ల): మండలంలోని తొండపి గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం మంగళవారం జరిగింది. పీహెచ్‌సీ వైద్యులు ఎస్.సూర్యప్రకాశరావు, జయకృష్ణ 106 మందికి వైద్యసేవలందించారు. అనారోగ్యానికి గురై మంచానికే పరిమితమైన వారి వద్దకు వెళ్లి వైద్యసేవలందించారు. పాఠశాల విద్యార్థులకు వైద్యపరీక్షలు చేశారు. సూపర్‌వైజర్లు పీటర్‌డానియేన్, జోస్ఫిన్‌రాణి, ఏఎన్ఎంలు, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు సామాజిక తనిఖీపై సమావేశం

ముప్పాళ్ల: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం సామాజిక తనిఖీ లపై మండలస్థాయి సమావేశం బుధవారం జరుగుతుందని ఉపాధి హామీ పథకం ఏపీఓ రామారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మధ్యాహ్నం 3గంటలకు జరిగే ఈ సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది హాజరుకావాలని పేర్కొన్నారు. 2021 ఏప్రిల్ 1 నుంచి 2022 మార్చి 31 వరకు ఆయా గ్రామాల్లో జరిగిన ఉపాధి హామీ పనులపై సోషల్ ఆడిట్ సభ్యులు తనిఖీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

సాదా బైనామా క్రమబద్ధీకరణపై సదస్సు

నార్నెపాడు(ముప్పాళ్ల): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సాదా బైనామాల ద్వారా కొనుగోలు చేసిన భూములను క్రమబద్ధీకరించడం జరుగుతుందని తహసీల్దార్ ఎం.భవానిశంకర్ చెప్పారు. మండలంలోని నార్నెపాడు గ్రామంలో సాదా బైనామాల క్రమబద్ధీకరణపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వ్యవసాయ భూమిని 2021 నవంబర్ 1కి ముందు తెల్లకాగితం పై కొనుగోలు చేసుకున్న రైతులు 31 డిసెంబరు 2023 లోపు తహసీల్దార్‌కు గ్రామసచివాలయం ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పరస్పర అంగీకారంతో జరిగిన దరఖాస్తులను విచారణ చేసి, క్రమబద్ధీకరించే ప్రక్రియను రైతులకు వివరించారు. రెండున్నర ఎకరాల మాగాణి, ఐదు ఎకరాలలోపు మెట్ట ఉన్న రైతులు ఎలాంటి స్టాంప్ డ్యూటీ చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. తహసీల్దార్ విచారణ తరువాత ఫారం–13ఏ లో సంబంధిత భూములకు స్టాంప్ డ్యూటీ నిర్ధారించమని సంబంధిత రిజిస్ట్రార్‌కు పంపడం జరుగుతుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాదు, గ్రామసర్పంచ్ పి.యలమంద, ఆర్.ఐ ఆంజనేయులు, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

చేనేత రంగానికి రూ.2 వేల కోట్లు కేటాయించాలి

సత్తెనపల్లి: రాష్ట్ర బడ్జెట్లో చేనేత రంగానికి రూ.2 వేల కోట్లు కేటాయించాలని, చేనేత పై జీఎస్టీ రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కట్టా శివ దుర్గారావు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని 1వ సచివాలయం వద్ద జరిగిన చేనేత కార్మికుల ధర్నాలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. ధర్నాకు పల్నాడు జిల్లా కార్యదర్శి అనుముల వీరబ్రహ్మం అధ్యక్షత వహించారు. పల్నాడు జిల్లా కమిటీ సభ్యులు గద్దం సునలోన్, పంతంగి ప్రభాకర్, గనికపూడి ఏసురత్నం, బిట్ర పానకాలు, గంజి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రతిష్ఠా మహోత్సవం

నరసరావుపేట రూరల్: రెడ్డినగర్‌లో నూతనంగా నిర్మించిన వరసిద్ధి వినాయక స్వామి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవం బుధవారం నుంచి వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. దాదాపు రూ.70 లక్షలతో ఆలయాన్ని నిర్మించారు. నేటి నుంచి ప్రారంభమయ్యే ప్రతిష్ఠా మహోత్సవాలు మూడు రోజుల పాటు కొనసాగుతాయి. ఈనెల 3వ తేదీ శుక్రవారం ఉదయం 11.42 గంటలకు ఆలయ ధ్రువబింబ, జీవధ్వజ, విమాన శిఖర, నాగరాజ, నవగ్రహ విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు.

